

జగన్ పోవాలి.. చంద్రబాబు రావాలి

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ చేస్తున్న అరాచక పాలనను అంతమొందిస్తూ చంద్రబాబు సీఎంగా రావాలంటూ ఆదివారం టీడీపీ శ్రేణులు భోగిపండుగ సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జీవో ప్రతులను దహనం చేశారు. కడపలోని ద్వారకానగర్‌లో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి నిరసన వ్యక్తం చేయగా, మాజీ ఇన్‌చార్జ్ అమీర్‌బాబు, ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తదితరులు నెహ్రూపార్కు సమీపంలోని అమీర్‌బాబు ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి చోటా జరిపారు.







విజయదుర్గా కాలనీలో కోలాటం ఆడుతున్న దృశ్యం

కడప వైసీపీలో.. మూడు ముక్కలాట

- డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి
- మూడు వర్గాలుగా విడిపోయిన కార్పొరేటర్లు
- కాక లేపుతున్న కడప రాజకీయం

మంచోడి బుద్ధి మాంసం కాడ తెలుస్తుందన్నట్లుగా.. రాజకీయ నాయకుల్లోని ఒరిజినల్ క్యారెక్టర్ ఎన్నికల సమయంలో బయటపడుతుంది. పొద్దున వరకు చెట్టా పట్టాలేసుకొని తిరిగి కౌగలించుకున్నప్పటికీ.. పదవి వచ్చేటప్పుడు వారిలో పొలిటికల్ నేతలు బయటకు వస్తారు. ఆ వ్యాఖ్యలు నిజమే.. ఎందుకంటే వైసీపీలో కడప టికెట్ ఆశించే వారిని, వారి మధ్య ఉన్న విభేదాలు చూస్తే అవుననిపిస్తుంది.

(కడప-ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిలకు కడపపై ప్రాబల్యం ఉంది. కార్పొరేటర్లలో కూడా ఈ ముగ్గురి అనుచరులు ఉండడం గమనార్హం. అయితే ముగ్గురూ కడపపై పట్టు సాధించి ఎమ్మెల్యేగా గెలవాలన్నది లక్ష్యం. ఇందులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కల నెరవేరగా, మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిలకు కడప ఎమ్మెల్యే కల నెరవేరలేదు. కడప టికెట్‌పై కన్నేసిన రవీంద్రనాథరెడ్డిని.. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు తమ రాజకీయ చతురతతో ఆయనను కడప బరిలోనే లేకుండా చేయడాన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పుడు ఎన్నికల సీజన్ రావడంతో మళ్లీ రవీంద్రనాథరెడ్డి వర్గం యాక్టివ్ అయింది. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా శుక్రవారం రాత్రి ఇచ్చిన విందుకు కూడా రవీంద్రనాథరెడ్డి వర్గీయులు, కార్పొరేటర్లు హాజరుకాలేదు. దీంతో ఇప్పుడు ఇదే కడప పొలిటికల్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. కాగా కడప టికెట్ తనకే ఖరారైందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చెబుతున్నారు. మేయర్ సురేష్‌బాబు కూడా ఆశిస్తున్నారు. టీడీపీ నాన్ మైనార్టీకి ఇచ్చింది. వైసీపీ కూడా ఇదే బాటలో పయనిస్తే.. తాను కానీ, తన కుమారుడిని కానీ పోటీ చేయించాలనే ఆలోచనలో రవీంద్రనాథరెడ్డి ఉన్నారు. మొత్తంగా చూస్తే ముగ్గురూ కడప టికెట్‌పై కన్నేయడంతో మూడు ముక్కలాటగా వైసీపీ మారింది.

ముగ్గురూ ముగ్గురే

మేయర్ సురేష్‌బాబు సర్పంచ్ నుంచి జడ్పీ పాలకవర్గం మేయర్‌గా పనిచేశారు. చట్టసభల్లో అడుగు పెట్టాలనేది ఈయన టార్గెట్ అంటారు. కడప టికెట్‌పై ఎప్పటి నుంచో ఈయన ఆశలు పెట్టుకున్నారు. అయితే ముస్లిం, ఇతర సామాజిక కారణాలతో ఇప్పటిదాకా బయట పెడుతూ వచ్చారు. అయితే ఈసారి టీడీపీ నాన్ మైనార్టీస్ హిందువులకు కేటాయించింది. వైసీపీ కూడా టికెట్ మార్చాలని సురేష్‌బాబు వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. కడప కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా, 49 మంది వైసీపీ వారు గెలుపొందగా, ఇండిపెండెంట్ కూడా వైసీపీ కార్పొరేటరు ఉన్నట్లు చెబుతారు. అయితే మేయర్ సురేష్‌బాబుకు ఎమ్మెల్యే టికెట్ కావాలంటూ 18 మంది కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సమావేశాలు పెట్టినట్లు కూడా చెప్పుకొస్తారు. బీసీ వర్గాల్లో సురేష్‌బాబుకు ఓ క్రేజ్ ఉంది. దీంతో పాటు కొందరికి ఆయన వ్యవహారశైలి నచ్చడంతో కొందరికి కనెక్ట్ అయ్యారు. అందుకే ఆ 18 మందికి సురేష్‌బాబును ఎమ్మెల్యేగా చూడాలనుంది. ఇటీవలే ఆయన అస్వస్థతకు గురయ్యారు. కోలుకుని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వయసు, ఆరోగ్యరీత్యా ఈ సారి ఎలాగైనా పోటీ చేయాలన్నది సురేష్‌బాబుకు ఉందని చెబుతారు. ఇక ముస్లిం కమ్యూనిటీలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా టికెట్ దాదాపు ఖరారైనట్లు చెబుతారు. అయితే జెండా మోసిన కార్యకర్తలకు, కష్టపడ్డ వారికి విలువ ఇవ్వలేదని ప్రచారం ఉంది. డిప్యూటీ సీఎం అయ్యాక అంజద్‌బాషా తన మార్కు పాలిటిక్స్ చూపిస్తారంటారు. తన వర్గానికి చెందిన కార్పొరేటర్లకు ఇతరత్రా పదవులు ఇచ్చేసి తాను స్ట్రాంగ్‌గా తయారయ్యే ప్రయత్నం చేస్తున్నారంటారు. అందుకు తగ్గట్లుగానే ఆయన మంచి పునాది వేసుకున్నట్లు చెబుతారు.

రగిలిపోతున్న రవీంద్రనాథరెడ్డి వర్గం

ఒకప్పుడు కడప అంటేనే రవీంద్రనాథరెడ్డి. 2004 ఎన్నికల ముందు కడప టీడీపీ కోట. అయితే తరువాత సమీకరణలు మారిపోయాయి. వైఎస్ సీఎం కావడం.. మున్సిపాలిటీగా ఉన్న కడపను కార్పొరేషన్‌గా మార్చడం.. ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాల్లో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బావమరిది, సీఎం మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిగా కడప పాలిటిక్స్‌పై తన మార్కు ఉంది. దివంగత వైఎస్ఆర్ సీఎం అయిన తరువాత కడప పాలిటిక్స్‌లో రవీంద్రనాథరెడ్డికి అప్పట్లో పెద్ద క్రేజే ఉండేది. కడప మొదటి మేయర్‌గా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి కడప పాలిటిక్స్‌పై రవిరెడ్డి కన్ను ఉంది. కడపలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్నది ఆయన ఆశయం అంటారు. ఆయన కాకపోయినా తన కొడుకునైనా కడపబరిలో పోటీ చేయించాలనుకున్నారు. అందుకు తగ్గట్లుగా 2004 నుంచి కడపపై పట్టు సాధిస్తూ వస్తున్నారు. మేయరుగా బాధ్యతలు చేపట్టడంతో పాటు తన అనుచరులను కార్పొరేటర్లుగా గెలిపించుకుంటూ తనమార్కు పాలిటిక్స్ చూపించేవారు. కడప అంటే ఈయనకు చాలా ఇష్టమంటారు. ప్రస్తుత పాలకవర్గంలో కూడా ఈయన అనుచరులు 12 మంది కార్పొరేటర్లుగా ఉన్నారని చెబుతుంటారు.

దివంగత వైఎస్ఆర్ హయాంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఒక వెలుగు వెలిగారు. ఆయన మేనల్లుడు జగన్ సీఎం అయిన తరువాత అంత కన్నా ఎక్కువ ఉంటుందని రవీంద్రనాథరెడ్డి అండ్ కో భావించింది. అయితే కుటుంబ సభ్యులను ఎలా కట్ చేశారో ఈయనను కూడా ఆ స్థాయిలోనే జగన్ కట్ చేశారంటారు. కడప టికెట్‌ను ఆశిస్తున్న ఈయన ఆశలపై జగన్ నీళ్లు చల్లడం వదిలేస్తే.. రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే ఈయన మనుషులే నగర అధ్యక్షుడు, ఇతరత్రా పార్టీ పదవులను చేపట్టారు. అయితే ప్రస్తుతం ఈయన వర్గీయులకు కార్పొరేషన్ పదవులు తప్ప మిగతావేవీ దక్కలేదంటారు. దీనిపై రవీంద్రనాథరెడ్డి వర్గాల్లో తీవ్ర అసంతృప్తి ఉందని చెబుతారు. డిప్యూటీ సీఎం ఇచ్చిన విందుకు వీరి అనుచరులకు సమాచారం లేదంటారు. జగన్ సీఎం కాక ముందు కడపలో జగన్ జన్మదినోత్సవం, వైసీపీ ఆవిర్భావం, పెళ్లిరోజు ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా జగన్ రాక సందర్భంగా జిల్లాలో స్వాగత తోరణాలు వెలిసేవి. అప్పట్లో రవీంద్రనాథరెడ్డి, అంజద్‌బాషా, సురేష్‌బాబు ఫ్లెక్సీలు వేసేవారు. జగన్ సీఎం అయిన తరువాత కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు.. దీటుగా రవీంద్రనాథరెడ్డి ఫ్లెక్సీలు వేసిన వారిని దూరం పెట్టేవారంటారు. దీంతో తమ బాస్‌ను అవమానిస్తున్నారంటూ ఆయన వర్గీయుల్లో ఉంది. అవకాశం వస్తే కడప నుంచి పోటీ చేయాలనే ఆలోచనలో రవీంద్రనాథరెడ్డి రెడీగా ఉన్నారని చెబుతారు. అయితే పైకి కనిపించే ప్రేమానురాగాలు లోపల లేవని కడప పాలిటిక్స్‌లో అర్థమవుతుంది.



వేడుకగా భోగి పండుగ

- జిల్లాలో మొదలైన సంబరాలు
- నేడు మకర సంక్రాంతి

కడప(కల్చరల్), జనవరి 14: సంక్రాంతి సందర్భంగా మొదటిరోజైన ఆదివారం భోగి పండుగ సంబరాలు తెలుగు లోగిళ్లలో అంబరాన్ని తాకాయి. తెల్లవారు జామునే పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా పిల్లలు, పెద్దలు వీధుల్లో భోగి మంటలు వేసుకొని పండుగకు స్వాగతం పలికారు. ఇప్పటికే పల్లెల్లో పండుగ శోభ ఉట్టిపడింది. ఆప్యాయపు పలకరింపులు, చిన్ననాటి మిత్రులతో సరదాగా గడిపారు. ఇళ్లలోని పాత వస్తువులను కుప్పలుగా పేర్చి భోగిమంటలను వేసుకున్నారు. ఆ క్రమంలో నగరంలోని పలు ప్రాంతాల్లో భోగి సంబరాలు జరుపుకున్నారు. ఇక నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గా కాలనీలో భోగిసంబరాలు అట్టహాసంగా సాగాయి. హైదరాబాద్, బెంగుళూరు నగరాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు చేసిన కోలాటం, డ్యాన్స్‌లు ప్రత్యేకంగా నిలిచాయి.

నేడు, రేపు జిల్లాలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

కడప(కలెక్టరేట్), జనవరి 14: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమాచారం అందిందని కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ 15న రాత్రికి కడప ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని, 16న ఉదయం 10 గంటలకు పాత్రికేయుల సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం బాపట్ల జిల్లా అద్దంకి వెళ్తారని తెలిపారు.

ఏపీలో వైనాట్ కాంగ్రెస్

- వైసీపీ మునిగిపోయిన నావ
- పులివెందులలో ప్రజలు తిరస్కరించారు
- షర్మిల చేరికతో కాంగ్రెస్‌కు అదనపు బలం
- పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి



మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), జనవరి 14: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమని, కాంగ్రెస్ వీడి వైసీపీలో చేరిన వారంతా వెనక్కు రానున్నారని, 'ఏపీ వై నాట్ కాంగ్రెస్' నినాదంతో ముందుకెళ్లనున్నట్లు మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు గుండ్లకుంట్ల శ్రీరాములుతో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. వైసీపీ మునిగిపోయే నావ అని, జగన్ పాలన అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. జగన్ సొంత ఐప్యాక్ సర్వే కూడా 25 మంది మంత్రుల్లో 20 మంది ఓటమి పాలవుతున్నారని చెప్పడంతో జగన్‌కు నిద్రపట్టడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు, నిరుద్యోగులు తిప్పికొట్టారని, మూడు స్థానాలను టీడీపీకి కట్టబెట్టారనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పులివెందులకు జగన్ వచ్చినప్పుడు రకరకాల ప్రయోగాలు చేసినా జనాలు రావడం లేదని, పులివెందుల ప్రజలకు భ్రమలు తొలిగాయన్నారు. నియోజకవర్గంలో జగనన్న ఇళ్లు దాదాపు 7,350 వరకు ఇస్తే అందులో 5 ఇళ్లు పూర్తి కావడం చూస్తే జగన్ పాలన అట్టర్ ఫ్లాప్ అనేందుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే విషయంలో మొండిగా ఎస్మా ప్రయోగించడం వైసీపీ పతనానికి నాంది అని మండిపడ్డారు. కాగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లోకి రావడం అదనపు బలమన్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇచ్చారని, ఈ దఫా ఎన్నికల్లో ఏపీలో కూడా ప్రజలు ఆశీర్వదించడం ఖాయమన్నారు. రాహుల్ గాంధీ చేపట్టబోయే భారత్ జోడో న్యాయయాత్ర దేశంలో 110 జిల్లాల్లో, 337 అసెంబ్లీల పరిధిలో సాగనుందని, రాజకీయ, సామాజిక, ఆర్థిక, రైతు, నిరుద్యోగ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇండియా కూటమికి అధికారం ఖాయమన్నారు. అనంతరం మండలాల వారీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఏ సత్తార్, చీకటి చార్లెస్, నేతలు పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామలాదేవి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమానికి పెద్దపీట

- పుత్తా నరసింహారెడ్డి



ఎన్.పాలగిరిలో పుత్తా నరసింహారెడ్డి, తనయుడు కృష్ణచైతన్యరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

వీరపునాయునిపల్లె, జనవరి 14: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, మేనిఫెస్టోతో ప్రతి కుటుంబానికీ మేలు జరుగుతుందని కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం ఎన్.పాలగిరిలో టీడీపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో తనయుడు పుత్తా కృష్ణచైతన్యకుమార్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ నేతలు గోపీనాథ్‌రెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబుళరెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఎన్.పాలగిరిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీకి హాజరైన పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు చేరాయి. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. మండల టీడీపీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సంగమేశ్వర ఆలయ మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, గంగిరెడ్డిపల్లె పోలీస్ రాజ, దర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్‌యాదవ్, తలపనూరు గంగిరెడ్డి, అడవిచెర్లోపల్లె గంగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎన్.పాలగిరి గోపీనాథ్‌రెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గోవిందరెడ్డి, పాయసంపల్లె శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మొయిళ్లచెరువు తిరుమలరెడ్డి, అలిదెన సర్పంచు ఓబులేసు, చిన్న ఓబులేసు పాల్గొన్నారు.



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న సీఎం సురేష్‌నాయుడు

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ

ప్రొద్దుటూరుటౌన్, జనవరి 14: తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పార్టీల పిలుపు మేరకు ఆయన ఆధ్వర్యంలో ఆదివారం భోగి సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములపేటలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, పట్టణాధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేశ్వరి, మహిళా అధ్యక్షురాలు నల్లబోతుల పావని, 10వ వార్డు ఇన్‌చార్జి నల్లబోతుల నాగరాజు, ఆంజనేయులు, పల్లా సాయిరామ్, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మత సామరస్యానికి ప్రతీక సంక్రాంతి

టీడీపీ నేత హరిప్రసాద్ ఆధ్వర్యంలో భారీ విందు

అన్ని వర్గాల ప్రజలు, నేతలు హాజరు



హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న అమీర్ బాబు, నజీర్ అహ్మద్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 14: మత సామరస్యానికి ప్రతీక కడప జిల్లా అని చెప్పాలి. జిల్లాలో ఏ పండుగ జరిగినా హిందూ, ముస్లిం, క్రైస్తవులు అందరూ కలిసి చేసుకోవడం ఆనవాయితీ. ఆదివారం కడప నగరం హరిటవర్స్‌లో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో భారీ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు టీడీపీ నేతలు పుత్తా నరసింహారెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, ఆర్.మాధవీరెడ్డి సహా వివిధ పార్టీల నేతలు, అన్నివర్గాల నగర ప్రముఖులు పాల్గొన్నారు. వారికి హరిప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా సంక్రాంతి విందు ఏర్పాటు చేస్తామన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల వారు ఈ విందుకు హాజరై పండుగను చేసుకుంటామని తెలిపారు.

భోగిమంటల్లో భూ హక్కు జీఓ ప్రతులు



భూ హక్కు చట్టం ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 14: సీఎం జగన్ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన శాశ్వత భూ హక్కు చట్టం జీఓ ప్రతులను సీపీఐ నేతలు భోగి మంటల్లో దహనం చేశారు. ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద భోగిమంటల్లో జీఓ ప్రతులు దహనం చేసిన అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన శాశ్వత భూ హక్కు చట్టం వెనుక రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకునే కుట్ర దాగి ఉందిన, భూబకాసురుల చట్టం ఉపసంహరించుకునే వరకూ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో భూమి లేని నిరుపేదలకు బంజరు భూములు పంపిణీ చేసేందుకు పాలక ప్రభుత్వాలు అసైన్‌మెంట్ కమిటీల ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు భూములు కేటాయించారన్నారు. వారికి కేటాయించిన భూములు కొందరు అన్యాక్రాంతం చేయడం, దౌర్జన్యంగా కొనుగోలు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని అసైన్‌మెంటు భూములు అమ్మకం, కొనుగోలు ఆపాలని చేసిన విజ్ఞప్తులకు అసైన్‌మెంటు, దేవదాయ, ఇనాం, వక్ఫ్‌బోర్డు, వంక, వాగు, చెరువు, రస్తా భూములను నిషేధిత భూముల జాబితా 22ఏలలో చేర్పిందన్నారు. డాట్‌ల్యాండ్ క్రమబద్ధీకరణ పేరుతో అసైన్‌మెంట్ భూములను నిషేధిత భూములను రిజిస్ట్రేషన్‌కు అంగీకరిస్తూ 22ఏ చట్ట సవరణ చేసి ఆక్రమించి అమ్ముకోవడానికి సీఎం ద్వారాలు తెరిచారన్నారు. భవిష్యత్తులో దళిత బహుజన మైనార్టీ వర్గాలకు భూమిని శాశ్వతంగా దూరం చేయడమే అవుతుందన్నారు. అధికార పార్టీ కుట్రలను తిప్పికొట్టక పోతే భవిష్యత్తులో ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు రక్షణ లేకుండాపోతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ఐఏఎల్ జిల్లా కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం, సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాసురేశ్, సావంత్ సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, గిరిజన సమాఖ్య బ్రహ్మం, ఏఐటీయూసీ లింగన్న, ఆర్.బాబు, సుబ్బరాయుడు, ఏపీ రైతు సంఘం బాలచంద్రయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువజంట ఆత్మహత్య

కడప (క్రైం), జనవరి 14: సహజీవనం చేస్తున్న యువ జంట పాలకొండ్రాయుడు (26), చందనా రెడ్డి (36) కడప రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న కడప రైల్వే ఎస్ఐ రారాజు మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రైల్వే ఎస్ఐ అందించిన వివరాల మేరకు.. కడప రవీంద్రనగర్‌కు చెందిన పాలకొండ్రాయుడు ఆరోగ్యశ్రీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నెహ్రూ నగర్ వాసి చందనారెడ్డి భర్తతో విడిపోయి, నెహ్రూ నగర్‌లోనే ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటోంది. వీరికి కొన్ని నెలల కిందట ఏర్పడిన పరిచయం వారి సహజీవనానికి దారి తీసింది. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ జంట పోలీసు స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కౌన్సిలింగ్ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇద్దరూ రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రాయచోటి రోడ్డులోని రైల్వే గేటు వద్ద కడప ఐటీఐ ప్రాంతానికి చెందిన షేక్ ఖదీర్ (36) రైలు కింద పడి ఆత్మహత్యయత్నం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. కొంత కాలంగా ఖదీర్ కుటుంబ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంలో ఆదివారం రైలు కింద పడడంతో కాళ్లు చేతులు కట్ అయ్యాయని, వైద్యపరీక్షల నిమిత్తం రిమ్స్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



చందనారెడ్డి - పాలకొండ్రాయుడు

భోగిమంటల్లో నిరంకుశవైఖరి దహనం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా



భోగిమంటల్లో ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 14: ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ, నిర్బంధ తీరు నశించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపించారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో ప్రభుత్వ నిరంకుశ వైఖరి దహనం పేరుతో ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిరంకుశ విధానాలు నశించాలంటూ చీకటి జీఓ ప్రతులను భోగిమంటల్లో దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ న్యాయబద్ధంగా తమకు రావలసిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా కాలయాపన చేస్తూ ఉద్యోగ ఉపాధ్యాయులను వేధించడం మంచిదికాదన్నారు. ఉపాధ్యాయుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక విధానాలు నేటితో ఈ భోగిమంటల్లో నశించి సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అయినా డీఏ, పీఆర్సీ, సరెండరు లీవు, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంటు, సీపీఎస్ ఉద్యోగుల అరియర్స్ తదితర బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. 15 రోజులుగా తాలుకా స్థాయిలో ఆరుగంటల ధర్నా, జిల్లా స్థాయిలో 12గంటల ధర్నా, రాష్ట్ర స్థాయిలో 36గంటల ధర్నా యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. తాము పొదుపు చేసుకున్న పీఎఫ్‌కు సంబంధించిన రూ.3వేల కోట్ల బకాయిలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని మిగిలిన రూ.15వేల కోట్లు బకాయిల విడుదలలో నిర్లక్ష్యం వహించిందన్నారు. నానాటికీ పెరుగుతున్న ధరలకనుగుణంగా చెల్లించవలసిన డీఏలు అరియర్స్ చెల్లించకపోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికంగా ఎంతో మనోవేదనకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన పీఆర్సీ కమిషన్ ఏ మాత్రం పనిలోలేదని కమిటీ నివేదిక ఇచ్చేలోపు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బకాయిలన్నీ ప్రభుత్వం త్వరితగతిన చెల్లించాలని లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ప్రభుత్వం మెడలు వంచైనా న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు నరసింహారావు, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్, గంగన్న, శంకర్‌బాబు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, విశ్వనాథ్‌తో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

వల్లూరు, జనవరి 14: ప్రసిద్ధిగాంచిన పంచనదీ సంగమం కొండలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి సన్నిధిలో భోగి పండుగ పురస్కరించుకుని ఆదివారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మూలవిరాట్టును శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ సంతాన మల్లేశ్వరులకు అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదిక వద్దకు మేళతాళాలతో తీసుకువచ్చారు. ప్రండితులు ఆలయ అర్చకులు అఖిల్ దీక్షితులు కల్యాణం ప్రారంభించారు. అనంతరం కంకణ ధారణ గావించారు. అనంతరం కన్యాదానం చేపట్టారు. జీలకర బెల్లంను దేవమూర్తుల శిరస్సుపై ఉంచి మంగళ సూత్రాన్ని గోదాదేవి మెడలో అలంకరింపజేశారు. అనంతరం ముత్యాల తలంబ్రాలను పోశారు. అంతకు ముందు గోదాదేవి కల్యాణ విశిష్టతను భక్తులకు వినిపించారు. కల్యాణం అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం ఆలయ ఈఓ, ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అందించారు.



మాంగల్యధారణను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

నేడు చెన్నకేశవస్వామి తిరుణాళ్ల

పెండ్లిమర్రి, జనవరి 14: వెల్లటూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామికి సోమవారం తిరుణాళ్ల నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహించనుననట్లు తెలిపారు. భక్తులు దర్శించుకుని స్వామివారి కృపకుపాత్రులకావాలని కోరారు. తిరుణాళ్ల సందర్భంగా కోలాటం ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. సేద్యపు ఎద్దుల విభాగంచే ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరుసగా ఏడు బహుమతులు రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కమణీయం వేంకటేశ్వరుడి కల్యాణం

వేంపల్లె, జనవరి 14: వేంపల్లెలోని వృషభాచలేశ్వర దేవస్థాన అనుబంధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమణీయంగా జరిగింది. భోగి పండుగ రోజు ఏటా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం రాత్రి 7గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమై వేడుకగా జరిగింది. వేంకటేశ్వరుని కల్యాణోత్సవం తిలకించి పులకించారు. పెద్దఎత్తున భక్తులు హాజరు కాగా కల్యాణోత్సవం అనంతరం ప్రసాదాలను పంచి పెట్టారు. ఆలయ చైర్మన్ కురాకుల వెంకటేశ్, ఈఓ శ్రీధర్, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుక కన్నుల విందుగా జరిగింది.

వైభవంగా భోగి

చెన్నూరు, జనవరి 14: మండల వ్యాప్తంగా భోగి పండుగను సంప్రదాయ పద్ధతిలో ఆనందోత్సాహాల మధ్య చేసుకున్నారు. తెల్లవారుజామునే ఇంటి ముంగిట భోగి మంటలు వేసి ఆ మంటల్లో ఇప్పటివరకు పనికిరాని వస్తువులు వేసి, కుటుంబాలన్నీ సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. కొండపేట, చెన్నూరు నాగులకట్ల వీధుల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, స్లోసైకిల్ ఇలా రకరకాల ఆటల పోటీలను చిన్నారులకు సైతం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి భోగి సందర్భంగా ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరారు. ఎంపీపీ చీర్ల సురేశ్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఐ.శివారెడ్డి, తెలుగుయువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ జిల్లా నేత షబ్బీర్‌హుసేన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

కోడి పందెంరాయుళ్లు అరెస్టు



కోళ్లతో నిందితులు

రైల్వేకోడూరు, జనవరి 14: మండలంలో కోడి పందెం స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. రైల్వేకోడూరు ఎస్ఐ-2 వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో కోడిపందెం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని, 3 కోళ్లు, రూ.1660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో చీకటి పాలన

భోగిమంటల్లో జీఓ ప్రతులు దహనం చేసిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు



ద్వారకానగర్‌లో జీఓ ప్రతులను దహనం చేస్తున్న శ్రీనివాసులురెడ్డి, మాధవీరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి - అమీర్‌బాబు ఇంటివద్ద అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 14: రాష్ట్రంలో వైసీపీ చీకటి పాలన కొనసాగుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి ఆరోపించారు. ఆదివారం ద్వారకానగర్ శ్రీనివాసులరెడ్డి ఇంటి ఎదుట భోగి పండుగలో భాగంగా ప్రభుత్వ చీకటి పాలనకు నిరసనగా భోగి మంటల్లో ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రతులను దహనం చేశారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో తెలుగువారు అత్యంత ఆనందంతో చేసుకునే పండుగ సంక్రాంతి అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సంక్రాంతి పండుగకు నిర్వచనం పూర్తిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా నిరసనలు, ఆందోళనలతో ఉద్యోగులు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ అంగన్వాడీ ఆయా ఆశా వర్కర్లు ఇలా ప్రతి ఒక్క వర్గం కూడా రోడ్లపై నిరసనలు చేస్తూ పండుగ పూట పస్తులతో ఉంటున్నార న్నారు. ఇటువంటి దుస్థితి ఏ రాష్ట్రానికి కూడా రాకూడదన్నారు. ఈ చేతగాని ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా విడుదల చేసిన విద్యుత్ చార్జీల పెంపు, దళితులు బీసీలపై దాడులు, ఇంకా అనేక ప్రజా వ్యతిరేక జీఓ ప్రతులను దహనం చేశామన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు సుఖ సంతోషాలతో పండుగ చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్, టీడీపీ నేతలు, పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస నియంత పాలన

రాష్ట్రంలో రాక్షస నియంత పాలన కొనసాగుతోందని టీడీపీ నేతలు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి ఆరోపించారు. ఆదివారం అమీర్‌బాబు ఇంటి వద్ద జగన్ పాలనను నిరసిస్తూ జీఓ పత్రాలు భోగిమంటల్లో దహనం చేశారు. రాష్ట్రంలో ఒక రాక్షస పాలన, నియంత పాలన, విలయతాండవం చేస్తోందన్నారు. ప్రజలను సుఖసంతోషా లతో జీవించేలా చేయడం లేదని, ఎప్పుడూ నిత్యం ఏదొక అరాచకం కార్యక్రమాలతో, ఈ రాష్ట్రం అట్టుడికి పోతోందన్నారు. రాష్ట్ర ప్రజలు సైకో జగన్ ప్రభుత్వంలో విసిగి పోయారన్నారు. ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా అయిపోయి సంక్షేమ పథకాలు పూర్తిగా నిర్వీర్యమైపోయి జగన్‌రెడ్డి ప్రభుత్వం అధికార దాహం, ధనంపై ఆశతో ఈ రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తూ దేశంలోనే మన రాష్ట్రాన్ని నవ్వులపాలు చేసిన ఘనత సైకో జగన్‌రెడ్డికి దక్కిందన్నారు.

కార్యక్రమంలో కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, కొండాసుబ్బయ్య, లింగాల శివశంకర్ రెడ్డి, మురళీమోహన్, ఇమ్రాన్, మేకల వెంకటేశ్‌యాదవ్, మామిళ్ల శివ, ఇప్పల నాగేంద్ర నాయుడు, శేషయ్య నాయుడు, నాసర్ అలీ, మహిళా అధికార ప్రతినిధి కటారి స్వర్ణలత, నూర్‌బాషా, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్వాస మీద ధ్యాసే ధ్యానం

ఘనంగా పోలీస్ పిరమిడ్ వార్షికోత్సవం

కడప (క్రైం), జనవరి 14: కడప పోలీసు పిరమిడ్ కేంద్రంలో వేడుకగా వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శేషారెడ్డి మాట్లాడుతూ పోలీసులంటే కరుకుగా వ్యవహరిస్తారని చాలామంది అనుకుంటారని, అది వాస్తవం కాదన్నారు. ప్రజల మేలు కోసమే పోలీసులు ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని అందులో భాగంగానే ఈ పోలీసు పిరమిడ్ కేంద్రం ఆవిర్భావమన్నారు. ముఖ్యఅతిథి డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ మహర్షి పత్రీజీ అనేక మందికి శ్వాస మీద ధ్యాస ధ్యానం గురించి బోధించి వెళ్లారని ఆయన భౌతికంగా లేకపోయినా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగుతుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ సెక్రటరీ ఉప్పుశంకర్ పాల్గొని పోలీసు పిరమిడ్ కేంద్రానికి ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా తాము ముందుండి ఆదుకుంటామన్నారు. పోలీసు పిరమిడ్ కేంద్రం యూత్ సభ్యులు మాట్లాడుతూ పోలీసు కేంద్రం నిర్మాణానికి ఉదారంగా రూ.15లక్షలు విరాళం ఇచ్చిన పుణ్యదంపతులు ఉర్మిళా శేషారెడ్డి అని అభినందనలు ముంచెత్తారు. పోలీసు పిరమిడ్ కేంద్రం, ధ్యానులకు తల్లిదండ్రులు లాంటి వాళ్లు ఊర్మిళా శేషారెడ్డి అని, వారిని పిరమిడ్ కేంద్రం కమిటీ సభ్యులు సన్మానించారు.

కడప (నాగరాజుపేట), జనవరి 14: పండుగ పబ్బం లేకుండా రోడ్లపైనే ఉంటూ తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న అంగన్వాడీలను పట్టించుకోకుండా నీవు మాత్రం పండుగ చేసుకుంటూ మమ్మల్ని పస్తులు ఉంచుతున్నావా జగన్‌రెడ్డీ అని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారానికి 34వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా అంగన్వాడీలు రోడ్డుపైనే బోగిమంటలు వేసి జీఓ, ఎస్మా కాపీలను దహనం చేశారు. అనంతరం రోడ్డుపైనే దోసెలు వేసి వినూత్న నిరసన తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. కేవలం తూతూమంత్రంగా బొత్స సత్యనారాయణ, సజ్జల రామక్రిష్ణారెడ్డి చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించకుండా, వెంటనే విధుల్లో రావాలని లేదంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి బెదిరింపులకు అంగన్వాడీలు బెదిరిపోయే రకం కాదన్నారు. పండుగలు పబ్బాలు వదిలేసి కుటుంబాలను వదిలేసి రోడ్లపైనే శాంతియుతంగా నెలకు పైగా సమ్మె చేస్తుంటే మహిళలమని కనీసం మానవత్వం లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తల్లీబిడ్డకు సంరక్షణ కల్పిస్తున్న అంగన్వాడీలపై జగన్ ప్రభుత్వం దుర్మార్గంగా

పండగ మీకు.. పస్తులు మాకా జగన్‌రెడ్డీ..!

- రోడ్డుపైనే దోశలు వేసి వినూత్న నిరసన
- భోగిమంటల్లో జీఓ కాపీలు దహనం : యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా
- 34వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె


బోగిమంట చుట్టూ తిరుగుతున్న అంగన్వాడీలు - రోడ్డుపైనే దోశలు వేస్తున్న దృశ్యం

వ్యవహరించడం తగదని ఆగ్రహించారు. అంగన్వాడీల ఉసురు ఈ ప్రభుత్వానికి ఖచ్చితంగా తగిలి తీరుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని లేదంటే రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా నగర కార్యదర్శులు శివకుమార్, డీఎం ఓబులేసు, ఎస్ఎఫ్ఐ మాజీ నేతలు రాజేంద్ర, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎంపీ అంజనీదేవి, నేతలు సావిత్రి, విలీల, నాగవేణి, క్రిష్ణవేణి, సీఐటీయూ నేతలు ఉదయ్, మనోహర్, అంగన్వాడీ యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆనందాల సంక్రాంతి

- మకరరాశికి మార్తాండుడి ఆగమనం
- లోగిళ్లలో సంస్కృతి, సంప్రదాయం
- వాడవాడలా రంగవల్లుల మయం
- నేడు సంక్రాంతి పర్వదినం

కడప (కల్చరల్) జనవరి 14: సంక్రాంతి.... సరదాల పండుగ.... రైతన్నలకు కొత్త పంట చేతి కొచ్చినవేళ.... వ్యవసాయంలో చేదోడువాదోడుగా నిలిచిన బసవన్నలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపే సమయం. దేశానికి పట్టుగొమ్మగా పేరుగాంచిన గ్రామాల్లో సంక్రాంతి సందడి.. అంతా ఇంతా కాదు. స్వచ్ఛమైన గాలులతో.. మనసును కట్టిపడేసే ఆహ్లాదకరమైన వాతావరణం... ఆప్యాయంగా పలకరించే బంధుమిత్రులు... స్వర్ణకాంతులీనే వెన్ను విరిసిన పంట పొలాలు.... సరికొత్త అనుభూతినిచ్చే హరిదాసుల సంకీర్తనలు, డూడూ బసవన్నల విన్యాసాలు, ప్రతి ఇంటి ముంగిట కల్లాపి చల్లి అందంగా తీర్చిదిద్దిన ముత్యాల్లాంటి రంగు రంగుల ముగ్గులు.. అందులో గొబ్బిమ్మలు... పరికిణీ..లంగాల్లో యువతుల గొబ్బి పాటలు. కోళ్ళ పందేలు... వృషభ రాజముల బండలాగుడు పోటీలు... భోగిమంటలు.... గాలిలో పిల్లల గాలిపటాల ఎగురవేతలు.... అచ్చమైన సువాసనల తెలుగింటి పిండి వంటలు. అబ్బో ఒక టేమిటి... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వున్నాయి..... సంస్కృతి సంప్రదాయాల సమాహారంగా సంక్రాంతి పండుగ ఖ్యాతినార్జించింది. సొంత ఊరిలో కుటుంబ సభ్యులు.. బంధువులు, అయినవారి నడుమ గడిపితే వచ్చే ఆ ఆనందం ఏడాదికి సరిపడా వుంటుంది అనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

వాడవాడలా భోగి మంటలు

పల్లెసీమలలో.... పట్టణాల్లో భోగి పండుగ సరికొత్త సందడి తెచ్చింది. తెల్లవారుజామునే వీధుల్లో భోగి మంటల హడావుడి పండుగ సంబరానికి తెరతీసింది. తెలతెలవారే సమయంలో చల్లని చలిగాలిని వెచ్చని భోగిమంటలతో కొంగ్రొత్త ఆశలకు ఊపిరిపోసుకునేలా పిల్లలు.. పెద్దలు...వృద్ధులు సైతం కేరింతలతో ఆనందకర వాతావరణంలో గడిపారు. మూడు రోజుల పండుగను చేసుకునేందుకు పట్టణ వాసులు పల్లెలకు చేరి బంధువులు. చిన్ననాటి మిత్రులతో కలిసి సంతోషంగా భోగిమంటల వద్ద సందడిగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ బాల్యాన్ని గుర్తు చేసుకుని పెద్దలు, ఆటపాటలతో చిన్నారులు, పందేలు వేసుకుని మరికొందరు ఆనందసాగరంలో ఓలలాడారు.

రతనాల రంగవల్లులు... ముత్యాల ముగ్గులు

సంక్రాంతి సంబరాల్లో మహిళలు వేసే రతనాల రంగవల్లులు.. ముత్యాల ముగ్గుల సందడి అంతా ఇంతా కాదన్నట్లుగా వుంటుంది. ముఖ్యంగా వీధుల్లో మహిళలు గుమికూడి ఇళ్ళముందు చుక్కలతో ముగ్గులు వేసి వాటికి రంగులద్దడంతో సరికొత్త కాంతులీనుతూ రంగవల్లులు కనిపించాయి.

శిల్పారామంలో సందడి

నగర రిమ్స్ సమీప శిల్పారామంలో సాయంత్రం 6 గంటలకు భోగిమంటల సందడి కనువిందు చేసింది. పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో సాగిన భోగి సంబరాలు అంబరాన్ని అంటేలా నిర్వహించారు. తదనంతరం సాంస్కృతిక కళావేదికపై మిస్సామూవి సహకారంతో కడప నగరానికి చెందిన దేవా డ్యాన్స్ అకాడమీ వారిచే పల్లె, జానపదాలు, శాస్త్రీయ గీతాలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. చిన్నపిల్లలు గాలిపటాలను ఎగురవేసి సందడి చేశారు.

చింతకొమ్మదిన్నెలో....

సికెదిన్నె, జనవరి 14: మండలంలో బోగి పండుగ సందర్భంగా ప్రజలు ఘనంగా చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామునే ఇళ్లవద్ద బోగిమంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. బంధుమిత్రులతో పల్లెలు కళకళలాడాయి. ఇళ్లముంగిట ముగ్గులు వేసి గొబ్బెమ్మలు నిలిపి పిల్లలకు బోగిపండ్లతో స్నానాలు చేయించి పండుగను ఆనందంగా చేసుకున్నారు.


శిల్పారామంలో భోగి పండుగ సందడి


భోగిమంట వద్ద మహిళల ఆనందాలు

ఘనంగా భోగి పర్వదినం

పులివెందుల టౌన్, జనవరి 14: సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే తెలుగువారి ముఖ్యమైన పండుగ సంక్రాంతి పర్వదినానికి మొదటి రోజు భోగి ఘనంగా చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు, పూలతో అలంకరించారు. చిన్నారులకు భోగి పండ్లతో స్నానాలాచరించి ఇష్టదైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రోడ్లన్నీ కిటకిటలాడాయి. శిల్పారామంలో ఉయం నుంచి ప్రజలు వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.


శిల్పారామంలో చిన్నారుల ఆట, పాట

గ్లోబల్ రిఫ్రిజిరేషన్ సేల్స్ అండ్ సర్వీస్ షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవిరెడ్డి

కడప (క్రైం), జనవరి 14: రాధాక్రిష్ణనగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ రిఫ్రిజిరేషన్ సేల్స్ అండ్ సర్వీస్ షోరూంను ఆదివారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నగర ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, షోరూం యజమాని ముక్తియార్ ప్రారంభించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యాపారం ప్రజల నమ్మకంతో ఉంటుందని, ఎల్లప్పుడూ ప్రజలకందుబాటులో ఉండి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముక్తియార్, టీడీపీ నేత జమీల్, సయ్యద్ సలావుద్దీన్, ముష్టక్, గ్లోబల్ ట్రావెల్స్ ఎండీ జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం బాధ్యత


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న గోవిందునాగరాజు

కడప (కల్చరల్) జనవరి 14: సమాజంలో అనాథ వృద్ధులను ఆదరించడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందునాగరాజు పేర్కొన్నారు. జాతీయ యువజన వారోత్సవాల్లో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో గాయత్రి మహిళా మండలి సారథ్యంలో ప్రేమాలయం వృద్ధాశ్రమ అనాథ వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మండలి అధ్యక్షురాలు నారాయణమ్మ, వెంకట లక్షుమ్మ, ధనలక్ష్మి, సింధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం


శ్రీరంగనాథస్వామి గోదాదేవిల కల్యాణ మహోత్సవ దృశ్యం

పులివెందుల రూరల్, జనవరి 14: రంగనాథస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని బోగి పండుగ నాడు శ్రీరంగనాథ స్వామి, గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని ప్రధానఅర్చకులు సోమేపల్లె కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథస్వామి వారిని తన భక్తితో వివాహమాడిన విధం భక్తులకు వివరించారు. ఆలయ ఛైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ వెంకటరమణ, శ్రీరంగనాథ ట్రస్ట్ ఛైర్మన్ చిన్నరంగనాయకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం - ఇద్దరి అరెస్టు


మద్యం బాటిళ్లతో నిందితుడు

కడప (క్రైం), జనవరి 14: రెండు వేర్వేరు ప్రాంతాల్లో 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కడప నగరం బ్రాహ్మణవీధి రెండో గాంధీ బొమ్మ వద్ద అక్రమ మద్యం అమ్ముతున్న గోగుల వసంత్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 28 క్వార్టర్ మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకున్నట్లు కడప వన్‌టౌన్ ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కడప రిమ్స్ పరిధి వైఎస్ఆర్ సర్కిల్ వద్ద మద్యంను అక్రమంగా విక్ర యిస్తున్న అక్కాయపల్లెకు చెందిన చంద్రశేఖర్‌ను సీఐ కె.రామచంద్ర తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అతని వద్ద నుండి 8 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేశారు.

చీకటి జీవోలను దహనం చేసిన టీడీపీ శ్రేణులు



జమ్మలమడుగులో చీకటి జీవోలను దహనం చేస్తున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జనవరి 14: జమ్మలమడుగులో ఆదివారం ఉదయాన్నే టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కన్నెలూరు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులు, టీడీపీ నాయకులు, అభిమానులు పిలుపు మేరకు ఆయన ఉదయాన్నే చేరుకుని భోగి సంబరాలు జరుపుకున్నారు. అందులో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన చీకటి జీవోలు, మోసపు హామీలు తదితర ప్రతులను భోగిమంటల్లో తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవనీశ్వరరెడ్డి, మండలాధ్యక్షులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, అంబవరం రామయ్య, చక్రపాణిరెడ్డి, జి.కె.గైబు, కిరణ్‌రాయల్, బిందు నాగేశ్వరరెడ్డి, కన్నెలూరు టీడీపీ నేతలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బద్వేలులో వైసీపీ చీకటి జీవోలను భోగిమంటల్లో వేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు టౌన్..: వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం రాతియుగంగా మారిందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం ఎదుట భోగిమంటల్లో జాబ్‌క్యాలెండరు, హామీలు, పత్రాలు చీకటి జీవోలు ప్రతులను భోగిమంటల్లో వేసి టీడీపీ కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్యనిపుణులు రవి కుమార్‌రెడ్డి, కైవల్యరెడ్డి, పట్టణ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, జహంగీర్‌బాషా, బిగ్‌బాస్, వడ్లపూటి నాగభూషణం, లక్ష్మీదేవి, క్రిష్ణారెడ్డి, నానబాల వెంకటేశ్వర్లు, తుడిమెల వెంకటసుబ్బయ్య, కేవీ సుబ్బారెడ్డి, శింగరయ్య, వెంకటయ్యయాదవ్, నరసింహనాయుడు, చెన్నక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో భోగి మంటలు వేస్తున్న టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు తదితరులు

100 కుటుంబాలు టీడీపీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రితీష్‌రెడ్డి

కాశినాయన జనవరి14: కాశినాయన మండలంలో వైసీపీనుంచి టీడీపీలోకి భారీగా వలసలు మొదలయ్యాయి. ఆదివారం గొంటువారిపల్లెలో బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ,టీడీపీ యువ నేత కే.రితీష్‌రెడ్డి అధ్యక్షతన కొండా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. మొదట గ్రామానికి వచ్చిన టీడీపీ నాయకులు కే.విజయమ్మ,కే.రితీష్,బొజ్జారోశన్నకు టపాసులు పేల్చుతూ బ్యాండుమేళాలు,పూలమాలలతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సుంకే శ్రీనివాసులు,పాణ్యం చిన్నహుస్సేన్,కొండా దుగ్గిరెడ్డి, బసిరెడ్డి జయరామిరెడ్డి, గణితం విశ్వనాథ్ తదితర 100 కుటుంబాలకు చెందిన వారికి టీడీపీ కండువాలు కప్పి రితీష్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి,టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, రంతు,బి.వెంకటరెడ్డి, డి.క్రిష్ణారెడ్డి,ఓ.రోహిత్‌రెడ్డి,పోలిరెడ్డి,హోండా రవీంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడి, శ్రీనివాసురెడ్డి,నరసింహారెడ్డి,బాదుల్లా,అమర్‌నాథ్‌రెడ్డి ,విజయ్‌కుమార్‌రెడ్డి, బోవిళ్ల వెంకటరెడ్డి, రమణా రెడ్డి, కొండా నరసింహారెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన భోగి మంటల్లో భూ హక్కు జీఓ కాపీలను దహనం చేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

మైదుకూరు రూరల్, జనవరి 14 : సంక్రాంతి పండుగలో భాగంగా ఆదివారం భోగి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. కాగా సాయంత్రం శ్రీ లక్ష్మీమాధవరాయ స్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీనగరం చెందిన మహిళల కోలాటం పలువురిని కనువిందు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

161 మద్యం బాటిళ్ల పట్టివేత

ప్రొద్దుటూరు ,జనవరి 14 : గోవా నుంచి ప్రొద్దుటూరుకు భారీగా అక్రమ మద్యం రవాణా చేస్తున్న ముగ్గురిని ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని పెద్దశెట్టి పల్లె క్రాస్‌వద్ద సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వైపు వస్తున్న ఇన్నోవా వాహనాన్ని తనిఖీచేయగా అందులో గోవాకు చెందిన 161 మద్యం బాటిళ్ళను పట్టుకున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం రూరల్ పోలీసుస్టేషన్లో ఏఎస్పీ ప్రేర్ణ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రూరల్ పోలీసుస్టేషన్ లిమిట్స్ లోని పెద్ద శెట్టిపల్లె క్రాస్‌వద్ద జమ్మలమడుగు రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా జమ్మలమడుగునుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఇన్నోవా వాహనంలో గోవా రాష్ట్రనికిచెందిన 161 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం అక్రమ రవాణ చేస్తున్న ముగ్గురుని రూరల్ సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారన్నారు. కట్టం వీరేంద్ర, కోగటం షరీఫ్, వడ్ల వెంకట నాగచైతన్య ఆచారి ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి ఇన్నోవా వాహనం సీజ్ చేశామన్నారు. సమావేశంలో రూరల్ సీఐ రమణారెడ్డి , ఎస్ఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ, సంఘం నాయకులు

ప్రొద్దుటూరు ,జనవరి 14 : రోజురోజుకూ పెరిగిపోతున్న పాశ్చాత్య సంస్కృతి ప్రభావం నుంచి తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ పేర్కొన్నారు.ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్యర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాంగ కళ్యాణమండపంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మరో 97 మందికి కన్సొలేషన్‌బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో దేవాంగసంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్టినాగశయన, గిద్దలూరి ఈశ్వరయ్య, రెడ్డి చంద్రశేఖర, సుబ్రమణ్యం, గిద్దలూరు, జలంధర్ లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడికి ఘనసన్మానం



ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న సునీల్ కుమార్

బద్వేలు రూరల్, జనవరి 14 : ఆర్యవైశ్య ప్రముఖుడు, పారిశ్రామికవేత్త, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ కనమర్లపూటి ప్రసాద్ దంపతులను మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరు మాలేపాటి సునీల్‌కుమార్ భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన స్వగృహంలో శాలువా, పూలమాల, ఫ్రూట్స్, స్వీట్లు, డ్రైఫూట్లతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తున్న కనమర్లపూటి ప్రసాద్ భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి చేరుకుని ఆర్యవైశ్య అభివృద్ధికి మరెంతో సహకారం అందించాలని కోరారు.

కన్నుల పండువగా గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణం



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 14 : పట్టణంలోని వివిధ ఆలయాల్లో గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం తిరుప్పావై పాశురాలను పఠించారు. తెలుగు పండితులు మద్దిలేటయ్య పురాణ పఠనం చేశారు. గోదాదేవి, రంగనాయకుల స్వామికి విశేష పూజలు నిర్వహించి వేద పండితులు సుముహూర్తంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. బొల్లవరంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. మనోజీ రావు వృధిలోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయం, శ్రీకృష్ణాలయం, మైదుకూరు రోడ్డులోని పాండురంగస్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహించారు.



హాజరైన భక్తులు





ఏసీసీ పరిశ్రమ బాధితులతో నేడు సమావేశం

మైలవరం, జనవరి 14 : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం ఏసీసీ పరిశ్రమ భూబాధితులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. గొల్లపల్లి గ్రామంలో ఏసీసీ భూబాధిత రైతులతో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సమావేశం నిర్వహించి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

భోగిమంటల్లో ఎస్మాప్రతుల దహనం



ఎర్రగుంట్లలో భోగిమంటల్లో ఎస్మా ప్రతులను తగలబెడుతున్న అంగన్వాడీలు

ఎర్రగుంట్ల, జనవరి 14: అంగన్వాడీలు తమపై రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా ప్రతులను భోగిమంటల్లో తగలబెట్టారు. ఆదివారం భోగిపండుగ రోజున కూడా తమ ధర్నాను కొనసాగించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగ్గులువేసి గొబ్బెమ్మలను పెట్టారు. అనంతరం భోగిమంటలు వేసి అందులో ఎస్మా కాపీలను తగలబెట్టారు.

కొండాపురం..: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు 34వ రోజు ఆదివారం కొండాపురంలో ముగ్గులో సమస్యలు రాసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన ప్రదేశంలో చిన్న పిల్లలకు రేగుపళ్లు పోసి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు, తదిరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమ్మెను భగ్నం చేసేందుకు ప్రయత్నించడం దారుణమని సీఐటీయూ పట్టణ కో-కన్వీనరు కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం అంగన్వాడీల సమ్మెలో భాగంగా ఎస్మా జీవోనెం.2 కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్ని, నాగార్జున, రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖదీరయయ, ఐద్వామహిళా సంఘం పట్టణ నాయకురాలు నాగమ్మ, అంగన్వాడీ నాయకురాళ్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి నమ్మకం ద్రోహం చేస్తున్నారని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు అసోసియేషన్ నాయకులు విమర్శించారు. ఆదివారం జమ్మలమడుగు ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా భోగి మంటలలో ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ప్రసాద్, ఓబులేసు, సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, అంగన్వాడీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: బ్రిటీష్ పాలనలో సైతం ఎస్మా తరహా నిర్బంధ చట్టాలు తేలేదని జగన్ ప్రభుత్వం అంగన్‌వాడీలపై చర్యలకు దిగితే గట్టిగా బుద్ధి చెబుతామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో అంగన్‌వాడీలు చేస్తు న్న సమ్మె 34 వరోజుకు చేరుకుంది. భోగి పండుగ సందర్భంగా విధుల్లో చేరాలని ఇచ్చిన నోటీసులను భోగిమంటల్లో వేసి కాల్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సజ్జల దిష్టిబొమ్మ దహనం



పోరుమామిళ్ల, జనవరి 14 : అంగన్వాడీ కార్యకర్తలు, సీఐటీయూ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరింది. సీఎం సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి అంగన్వాడీలను చర్చలను పిలిపించి వట్టి చేతులతో వెనక్కి పంపిన కారణంగా ఈ సందర్భంగా వారు అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహరం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మేరీ, ఓబులాపురం విజయమ్మ, జ్యోతమ్మ, రేణుక, స్వాతి, ఫాతిమా, హబీబ్, రమాదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలపై నిరసన

పోరుమామిళ్ల, జనవరి 14 :ఉపాధ్యాయులకు రావాలసిన బకాయిలపై ప్రభుత్వం చెల్లించకపోవడంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం యూటీఎఫ్ పోరుమామిళ్ల రీజియన్‌లో భోగిమంటలు వేస్తూ ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య, సీఐటీయూ నాయకులు భైరవ ప్రసాద్, యూటీఎఫ్ రీజియన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

పోరుమామిళ్ల, జనవరి 14 : పోరుమామిళ్లలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భోగి పండుగ సందర్భంగా ఆదివారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తులసి సురేష్‌బాబు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించే వరకు పోరాటం

బద్వేలు రూరల్, జనవరి 14 : ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల బకాయలుపూర్తిస్థాయిలో చెల్లించేంత వరకు తమ పోరాటం ఆగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ హెచ్చరించారు. భోగిపండుగ సదర్భంగా ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అప్రజాస్వామిక నిరంకుశ వైఖరులను భోగిమంటల్లో దహనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు శివప్రసాద్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భోగి సంబరాలు

బద్వేలు, జనవరి 14: సంక్రాంతి సంబరాలతో పల్లె సీమలు కళకళలాడుతున్నాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం, నగర, పట్టణాల్లో ఉన్నవారు సొంత ఊర్లకు వచ్చారు. చిన్ననాటి స్నేహితులు, బంధువులు, కుటుంసభ్యులతో కలసి ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. సంస్కృతిని చాటే యువత సాంప్రదాయ దుస్తులను ధరించి గ్రామాల్లో సందడి చేస్తున్నారు. లోగిళ్ల రంగుల హంగులతో అలరారే వేళ ఇల్లు ఆనందాల మందిరమే, బోగభాగ్యాలను ప్రసాదించాలని దేవతలను వేడుకుంటూ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని రేగిపండ్లను చిన్నారుల తలపైపోసి పెద్దలంతా ఆశీర్వదించారు. బద్వేలునియోజకవర్గ ప్రజలు ముత్యాల ముగ్గులతో భోగికి ఘనంగా ఆహ్వానం పలికారు.రంగవల్లులు, బోగిమంటలతో సంక్రాంతి లక్ష్మికి ఘనస్వాగతం పలికారు. తెల్లవారు జామునే ఇళ్లముందు భోగిమంటలను వేశారు.



పట్టణంలోని పాత పోస్టాఫీసు వీధిలో వేసిన భోగిమంట

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే

జమ్మలమడుగు, జనవరి 14: ఎన్నికల్లో ప్రజలు ఆదరించి సైకిల్ గుర్తుకు ఓటేయాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోరగుడి గ్రామంలో భూపేశ్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్నాథం, విశ్వనాథరెడ్డి, ఇమ్మానుయేల్, చెన్నయ్య, కిశోర్, చంద్రాయుడు, ప్రసాద్, అనిల్, అశోక్, జి.ప్రసాద్, కుమార్, బాలిరెడ్డి, మాబాష, నర్శిరెడ్డి, తదితర నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

రూ.2లక్షలు నగదు స్వాధీనం

ముద్దనూరు జనవరి14:ఎన్నికల సందర్భంగా ఎర్రగుంట్ల రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీలో ఆదివారం రూ.2లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.అనంతపురం జిల్లా పామిడికి చెందిన రాజా అనే వ్యక్తి బొలోరో ట్యాంపర్ వాహనంలో చెన్నై నుంచి పామిడికి వెళుతుండగా తనిఖీలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.































